సాక్షి ఖమ్మం

ఆదివారం । 18 । జూన్ । 2023



అతివేగంగా గిరిజనాభివృద్ధి

తెలంగాణ ఏర్పడ్డాక గిరిజనుల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎంపీలు నామా నాగేశ్వరరావు, పార్థసారధిరెడ్డి తెలిపారు. 10లో



.. దళారులను నమ్మొద్దు

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలకు చేపట్టే మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో దళారులను నమ్మొద్దని డైరెక్టర్ బలరామ్ సూచించారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలోని ఆదివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'హరితోత్సవం' పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ, అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న హరితోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిర్వహించిన హరితహారం విజయాలు, అటవీ పునరుజ్జీవ విజయాలపై రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ వీ.పీ. గౌతమ్ శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్నేహలత, జిల్లా అటవీశాఖాధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ విద్యాచందన పాల్గొన్నారు.

రేపు అర్బన్ పార్క్‌ల్లో ఉచిత ప్రవేశం

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19వ తేదీన సోమవారం హరితోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని వెలుగుమట్ల, సత్తుపల్లిలోని లంకపల్లి అర్బన్ పార్క్‌ల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. హరితోత్సవం రోజున జిల్లాలో పచ్చదనం, అడవులు పెరిగిన తీరును ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున గర్భగుడిలో పూజలు నిర్వహించిన అర్చకులు, ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌గా శ్రీరామచంద్రమూర్తి



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

జమలాపురం ఆలయ నూతన చైర్మన్‌గా వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి నియామకయ్యారు. ఈసందర్భంగా ఆయనతో శనివారం ఈఓ కె.జగన్మోహన్‌రావు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు ప్రయాణికులకు రేపటి నుంచి 'టీ 9' టికెట్

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామీణ, పట్టణ ప్రయాణికుల కోసం 'టీ 9' టికెట్‌ను టీఎస్ ఆర్టీసీ సోమవారం నుండి అమలు చేయనుంది. ఈ సదుపాయం పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్లకు వర్తిస్తుంది. రూ.100విలువైన ఈ టికెట్‌తో ఒకరోజు 60 కిలోమీటర్ల పరిధిలో రానుపోను ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది. ఉదయం 9నుండి సాయంత్రం 6గంటల వరకు చెల్లుబాటయ్యే ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.20 నుండి రూ.40 వరకు ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు వయస్సు ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కండక్టర్‌కు చూపించి 'టీ 9' టికెట్ పొందొచ్చని, ఉదయం 9నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే టికెట్లు ఇస్తారని వెల్లడించారు.

కరుణించని భానుడు

- గరిష్టస్థాయిలోనే ఉష్ణోగ్రతలు

ఖమ్మంవ్యవసాయం: ఎండలు భగభగ మండుతున్నాయి. భానుడు ఇంకా కనికరించకపోవడంతో ఎండతీవ్రతకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఫలితంగా పగటి వేళ ప్రధాన రహదారులన్నీ బోసిపోతున్నాయి. నైరుతి రుతుపవనాల ఆగమనం ఆలస్యం కావడంతో ఎండ తీవ్రత, వడగాలులు కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలోని సత్తుపల్లిలో అత్యధికంగా 44.4 డిగ్రీలు, ఖానాపురం, పల్లెగూడెంల్లో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, ముదిగొండలో 43.9, సదాశివునిపాలెం, వేంసూరులో 43.8, బాణాపురంలో 43.7, నేలకొండపల్లి, పమ్మిలో 43.4, పనుబల్లిలో 42.9, గౌరారం, కల్లూరులో 42.6, ప్రకాష్‌నగర్‌లో 42.5, లింగాల, మధిర, రఘునాథపాలెం, ఎర్రుపాలెంలో 42.3, సిరిపురం, కాకరవాయి, గంగారంలో 42.2, గేటు కారేపల్లి, నాగులవంచలో 41.9, రావినూతల, చింతకాని, తిమ్మారావుపేట, బచ్చోడులో 41.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు వెల్లడించారు.

మనమెరిగిన తొలి నేస్తం నాన్న



నీడలా వెన్నంటి ప్రోత్సహించారు

– దురిశెట్టి అనుదీప్, కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం



సూపర్‌బజార్(కొత్తగూడెం) : మాది జగిత్యాల జిల్లా మెట్‌పల్లి. 2017లో సివిల్స్ జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకర్‌గా ఎదిగిన నా ప్రతి ప్రయత్నంలో మా నాన్నే నాకు స్ఫూర్తి. అక్షరాభ్యాసం కాకముందే నాకు ఆయన గురువు. మా నాన్న మనోహర్ విద్యుత్ శాఖలో ఉద్యోగిగా అంకితభావంతో పని చేస్తుండేవారు. దాన్ని చిన్నప్పటి నుంచే ఆకళింపు చేసుకున్నా. ఇక ఎప్పుడూ నీడలా నా వెన్నంటి ఉంటూ అనుక్షణం ప్రోత్సహించేవారు. 'నేనున్నా.. గో ఎ హెడ్' అంటూ ఇచ్చిన భరోసాయే నేను జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించడానికి దోహదం చేసింది. తొలిసారి కలెక్టర్‌గా సొంత రాష్ట్రంలో అవకాశం రావడం అదృష్టం. మా నాన్న స్ఫూర్తితోనే జిల్లాకు అనేక జాతీయ అవార్డులు సాధించేలా అడ్మినిస్ట్రేషన్ చేయగలిగాను. మా నాన్న నాకు రోల్ మోడల్. ఆయన నా కోసం కన్న కలలు నిజం చేస్తా. మంచి అధికారిగా పేరు తెచ్చుకుంటా.

నా గొప్ప స్నేహితుడు నాన్న

– విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్, ఖమ్మం



మా నాన్న శశికుమార్. స్వస్థలం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం కాగా ఆయన సౌదీలోని రియాద్, దుబాయ్‌లో పనిచేసేవారు. చిన్నప్పటి నుంచి నాన్నే నాకు ఒక గొప్ప స్నేహితుడని చెప్పాలి. ఎంతో దేశభక్తి కలిగిన నాన్న నాతో పాటు మా సోదరుడు అర్జున్‌ను ఏ పనిచేసినా, ఏ సర్వీస్ చేసినా దేశం, ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చెప్పేవారు. ఎంచుకున్న రంగాల్లో సైతం ప్రజాసేవకు మొదటి ప్రాముఖ్యత ఇవ్వాలని తెలియజేసేవారు. ఆయన సహకారంతోనే ఐపీఎస్ సాధించి ఈ స్థాయిలో ఉన్నాను. నాకు ఒక మంచి స్నేహితుడిలా అన్నివేళలా వెన్నుతట్టి ముందుకు సాగేలా సలహాలు ఇచ్చేవారు.

వైఫల్యాల్లోనూ అండగా నిలిచారు..

– పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ



నేను సివిల్స్‌లో 142వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ఎంపిక కావడానికి నాన్న ప్రోత్సాహమే కీలకం. మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. నాన్న డాక్టర్ నరేంద్ర నారాయణసింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్. అమ్మ డాక్టర్ కృతిసింగ్ పీహెచ్‌డీ చేశారు. ముగ్గురు సంతానంలో నేను చిన్నవాడిని కాగా, చదువుతోనే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని మాకు నాన్న ఉద్బోదించేవారు. చదువుపై ప్రేమ కలిగేలా తీర్చిదిద్దారు. నేను ఢిల్లీలో ఉండి సివిల్స్‌కు సిద్ధమవుతున్న సమయంలోనే కాక, మూడు సార్లు విఫలమైనా నాన్న చేసిన సూచనలు, ఇచ్చిన ధైర్యమే ఈ స్థాయికి చేర్చాయి. ఇప్పటికీ ఏ అంశంలోనైనా సందేహాలు వస్తే నాన్ననే అడుగుతా. అయితే, సంవత్సరంలో ఒకరోజు కాకుండా ప్రతినిత్యం ఫాదర్స్‌డేగానే భావించి ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలి.



మరికొన్ని కథనాలు 8లో..

- చేతిలో చేయి, చేతలకు చేయూత
- లక్ష్యం వైపు దూసుకెళ్లే బాణానికి విల్లు

నేడు ఫాదర్స్ డే

ఏ రెండు అక్షరాలైతే తెలియని ధైర్యాన్ని ఇస్తాయో..
ఏ అడుగులు జీవితకాలం తోడుగా మిగులుతాయో..
ఏ పిలుపు కుంగుబాటును పారద్రోలి ఉత్సాహాన్నిస్తుందో..
ఏ రూపు మనకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందో..

ఆ పిలుపే నాన్న!

అలాంటి నాన్నకు కృతజ్ఞత తెలపడానికి, ఆయన మన కోసం చేసిన త్యాగాలను గుర్తుకు తెచ్చుకోవడానికి ఏటా జూన్ మూడో ఆదివారం తండ్రుల దినోత్సవం(ఫాదర్స్ డే)గా జరుపుకుంటారు. ఈరోజు ఫాదర్స్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఉన్నతాధికారులు వారికి తండ్రితో ఉన్న అనుబంధం, విజయాలకు స్ఫూర్తిగా నిలిచిన వైనంపై కథనాలు..

ఐఏఎస్ సాధించడానికి నాన్నే ఆదర్శం

– ఆదర్శ్ సురభి, కేఎంసీ కమిషనర్



ఖమ్మంమయూరిసెంటర్: మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి. ప్రస్తుత జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో తహసీల్దార్‌గా పనిచేసినప్పుడు నాన్నతోనే ఉన్నాను. నాన్న తహసీల్దార్‌గా, ఆర్డీఓగా, జేసీగా విధులు నిర్వర్తించిన సమయంలో ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడాన్ని ప్రత్యక్షంగా చూశాను. తద్వారా ఐఏఎస్‌గా ఎంపికైతే ప్రజల సమస్యలు మరింత సులువుగా పరిష్కరించొచ్చని నిర్ణయించుకున్నాను. అదే సమయాన ప్రజలతో ఎలా మెదలాలో నేర్చుకున్నాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే సమయాన దిశానిర్దేశం చేసిన నాన్న సహకారంతోనే విజయం సాధించా.

ఐపీఎస్ వరకు నాన్న అడుగుజాడల్లో..

– డాక్టర్ వినీత్, ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం



కొత్తగూడెంటౌన్: అమ్మ రేణుకాదేవి కల, నాన్న గంగన్న ప్రోత్సాహంతో ఐపీఎస్ సాధించా. జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నానంటే నాన్న గంగన్న అందించిన ప్రోత్సాహమే కారణం. నా జీవితంలో ఫేవరెట్ హీరో అంటే నాన్నే. ప్రతీఒక్కరు ఉన్నతంగా రాణించాలంటే ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని చిన్నతనం నుంచే చెప్పేవారు. నాన్న గంగన్న చిరుద్యోగి అయి డడం ప్రోత్సహిం ఉండాలని, స్థాయిలో కష్టపడాబడేవారు. ఓవైపు మరోవైపు సివిల్స్‌కు నాన్న ప్రోత్సాహం, నేను ఐపీఎస్‌కు ఎంకనిపించిన ఆనందం నాన్న అడుగు జాడ నా లక్ష్యాల సాధనకు కష్టప తప్ప షార్ట్ కట్స్ ఉండవని చేవారు. లక్ష్యం ఉన్నతంగా దాన్ని సాధించేందుకు అదే లని చెబుతూ అండగా నిల డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తూనే సిద్ధమవుతున్న సమయంలో సహకారం మరువలేనివి. పికైన నప్పుడు నాన్న కళ్లలో అంతాఇంతా కాదు. మొత్తంగా ల్లోనే నా పయనం సాగింది.

ఆయనలా మేం కష్టపడొద్దని...

– ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)



సింగరేణి(కొత్తగూడెం): మా నాన్న హలాన్యా వ్యవసాయ కూలీ. నిరంతరం కూలీ పని చేస్తే పొట్ట గడవని రోజుల్లో నిత్యం 16 గంటలు కష్టపడి పనిచేస్తూ నాతో పాటు ఎనిమిది మందిని చదివించారు. ఆయనలా మేం కష్టపడొద్దని నిరంతరం చెప్పేవారు. నాన్న కష్టాన్ని గమనించి నేను కూడా తీరిక వేళల్లో చేదోడుగా ఉంటూనే చదువుకున్నా. ఐఆర్ఎస్‌కు ఎంపికై ఆదాయ పన్ను శాఖలో ఉద్యోగం సాధించాను, డిప్యూటేషన్‌పై ప్రస్తుతం సింగరేణి డైరెక్టర్(పా)గా విధులు నిర్వర్తిస్తున్నా. నేను చదువు విలువ తెలుసుకున్నందున నా తోబుట్టువులను కూడా బాగా చదివేలా ప్రోత్సహించడంతో మంచి స్థాయిలో స్థిరపడ్డాం.

'భగీరథ'తో తీరిన నీటికష్టాలు

- జిల్లాలోని 588 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- ఇంటింటా అందుతున్న తాగునీరు
- నేడు 'తెలంగాణ మంచినీళ్ల పండుగ'



తనికెళ్ల సమీపాన ముక్రిహిల్స్ వద్ద నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంట్

ఖమ్మంఅర్బన్: ఒకప్పుడు తాగునీటి ఎద్దడితో వేసవిలోనే కాదు సాధారణ సమయాల్లోనూ తాగునీటికి అల్లాడే ప్రజలకు మిషన్ భగీరథ పథకం అమలుతో ఆ కష్టాలు తీరాయి. గతంలో నీటి కోసం యుద్ధాలు జరగ్గా.. ఇప్పుడు పుష్కలంగా స్వచ్ఛమైన నీరు ఇంటి ముంగిట్లోకే చేరింది. తెలంగాణ ఏర్పడ్డాక ప్రవేశపెట్టిన మిషన భగీరథ పథకంతో ప్రధాన పైపులైన్ నిర్మాణమే కాక ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, సంపులు, బావుల నిర్మాణం, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. అక్కడక్కడా ఒకటీ, అరా సమస్యలు ఉన్నప్పటికీ ఎక్కువ శాతం ఇళ్లకు నీరు అందుతుండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవంలో భాగంగా ఆదివారం 'తెలంగాణ మంచినీళ్ల పండుగ' జరుపుకున్న నేపథ్యాన కథనం.

2,378 కి.మీ. మేర పైప్‌లైన్

జిల్లాలో మిషన్ భగీరథ పనులకు ప్రభుత్వం రూ.284కోట్లు ఖర్చు చేసింది. జిల్లాలోని 588 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తి కాగా, 2,378.89కి.మీ. మేర పైపులైన్ వేశారు. ఇక 1,85,357 గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వగా తాగునీరు సరఫరా అవుతోంది. అలాగే, 122 రైతు వేదికలు, 1,163 పాఠశాలలు, 815 అంగన్‌వాడీ కేంద్రాలు, 153 వైకుంఠధామాలకు సైతం నీటి వసతి కల్పించారు. గ్రిడ్ విభాగంలో ట్యాంకులు, సంపుల నిర్మాణం, పైపులైన్లు వేశారు.

పాలేరు రిజర్వాయర్ నుంచి 370 గ్రామాలకు..

పాలేరు రిజర్వాయర్ నుంచి పంపుసెట్ల ద్వారా నీటిని జీళ్లచెరువు వద్ద గుట్టపై నిర్మించిన ట్యాంక్‌లకు తరలిస్తున్నారు. అక్కడ నీటిని శుద్ధి చేసి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రధాన పైపులైన్ ద్వారా గ్రామాలకు సురక్షిత నీరు చేస్తున్నారు. జీళ్లచెరువు నుంచి 370 గ్రామాలకు రోజుకు 9 కోట్ల లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఇందుకోసం ఇక్కడ ప్రత్యేకంగా ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్, ఇన్ టేక్‌వెల్, సంపులు, పైపులైన్లు ఏర్పాటుచేశారు. ఇక్కడి నుంచే ఖమ్మం కార్పొరేషన్‌కు తాగునీరు అందుతోంది. కేఎంసీ పరిధిలో ఒక్కొక్కరికి ప్రతిరోజు 135 లీటర్లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు 100 లీటర్ల నీటిని అందిస్తున్నారు.

వైరా నుంచి 462 గ్రామాలకు..

వైరా రిజర్వాయర్ నుంచి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇందుకోసం మొత్తం రూ.730 కోట్లు వెచ్చించారు. వైరా రిజర్వాయర్ నుంచి కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని ముక్రిహిల్స్ వద్దకు నీటిని చేర్చి శుద్ధి చేశాక ఆరు మండలాల్లో 462 గ్రామాలకు ప్రతిరోజూ 5కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకు సంబంధించి 1,073 కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్ నిర్మించారు.

కేఎంసీ పరిధిలో...

ఖమ్మం కార్పొరేషన్‌లోని ఇంటింటికి తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకానికి ప్రభుత్వం రూ.230 కోట్లు వెచ్చించింది. ఖమ్మంలోని 60 డివిజన్ల పరిధిలో అన్ని కాలనీలకు శుద్ధమైన జలాన్ని సరఫరా చేసే బాధ్యతను జిల్లా ప్రజారోగ్య శాఖకు అప్పగించింది. ఖమ్మంలో ప్రస్తుతం జరుగుతున్న నీటి సరఫరాకు తోడు రాబోయే పదిహేనేళ్లలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా 31,600 నల్లాలకు నిరంతరం నీరు అందిస్తున్నారు.

పోరాటయోధులకు గౌరవం

థానూనాయక్ విగ్రహావిష్కరణలో మంత్రి పువ్వాడ



థానూనాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పడ్డాక పోరాటయోధులు, వైతాళికులను సముచితంగా గౌరవించుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ వెల్లడించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం గిరిజన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ థానూనాయక్ విగ్రహాన్ని మంత్రి పువ్వాడ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలు, సమస్యల సాధనకు పోరాడిన వారికి తెలంగాణ ఏర్పడ్డాక గౌరవిస్తున్నామని తెలిపారు. థానూనాయక్ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని అందరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కాగా, సీఎం కేసీఆర్ గిరిజనులకు రిజర్వేషన్లు పెంచడమే కాక స్వపరిపాలన కోసం తండాలను పంచాయతీలుగా మార్చారని తెలిపారు. అంతేకాకుండా పోడు భూములకు పట్టాలు ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. తొలుత ట్యాంక్‌బండ్‌పై గిరిజనులు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, విగ్రహ ఏర్పాటు కమిటీ బాధ్యులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ , పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుండి శనివారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వివరించారు. ఆదివారం తెలంగాణ మంచినీళ్ల పండుగ, సోమవారం హరితోత్సవం, 20న విద్యా దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహనకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

సర్వేలో వేగం పెంచాలి

జిల్లాలో ఎలక్టోరల్ సంబంధ డోర్ టు డోర్ సర్వేలో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన ఏఆర్‌ఓలు, తహసీల్దార్లు, బూత్ లెవల్ సూపర్‌వైజర్లతో వీసీ ద్వారా సర్వే, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించి సూచనలు చేశారు. ఓటు హక్కు లేని అర్హుల నుంచి దరఖాస్తు సేకరించడమే కాక ఇళ్లు మారిన, మరణించిన వారి వివరాలు సేకరించాలన్నారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్ సింగ్, ఆర్ఎంఓ రాజశేఖర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసమే 'ధరణి'

ప్రజలకు మెరుగైన పారదర్శకత సేవలందించేందుకు ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, ఆస్తుల బదిలీల్లో జవాబుదారితనమే కాక సురక్షితంగా లావాదేవీలు జరిగేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎర్రుపాలెం మండలంలోని అయ్యవారిగూడెంలో పలు సర్వే నంబర్లలోని భూములను 50 ఏళ్లుగా గ్రామస్తులు సాగు చేసుకుంటున్నా రెవెన్యూ రికార్డులో నమోదు కాక ఇబ్బంది పడ్డారన్నారు. తాజాగా ఈ సమస్యను పరిష్కరించి రైతులకు భూమిహక్కు పత్రాలను అందజేశామని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే రాజ్యాంగానికి రక్షణ

- కేంద్ర విధానాలను నిరసిస్తూ ఈనెల 21న సదస్సు
- విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపీనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజల భాగస్వామ్యంతోనే రాజ్యాంగానికి రక్షణ చేకూరుతుందని.. రాజ్యాంగ విరుద్ధ పాలనకు వ్యతిరేకంగా పోరాడడానికి ప్రజలు సన్నద్ధం కావాలని ప్రత్యామ్నాయ పౌరసమూహం(సీసీఏ) బాధ్యుడు డాక్టర్ గోపీనాథ్ వెల్లడించారు. ఈ నేపథ్యాన 21వ తేదీన ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సదస్సుకు ప్రజాస్వామిక వాదులంతా హాజరు కావాలని కోరారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర విధానాలు - విషాద పరిణామాలు' అంశంపై సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే సదస్సులో ముఖ్య అతిథిగా పరకాల ప్రభాకర్ పాల్గొననుండగా, 'ది క్రూక్‌డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' పుస్తకాన్ని ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న ఏ ఒక్క మాటకు కూడా విలువ ఇవ్వకుండా కేంద్రం ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్రాన్ని వ్యతిరేకించే వారిపై ఈడీ దాడులకు ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలపై మాట్లాడుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. అనంతరం డాక్టర్ వై.రవీంద్రనాథ్ మాట్లాడుతూ పండుగలు, పబ్బాలకు కూడా మతం రంగు పులుముతున్నారని, ఆచార వ్యవహారాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఇలాంటి విధానాలపై పౌరసమాజాన్ని కదిలించేందుకే సీసీఏ అడుగు వేసిందని తెలిపారు. ఈ సమావేశంలో సీసీఏ బాధ్యులు రవిమారుత్, స్పర్శ భాస్కర్, దేవిరెడ్డి విజయ్, చిర్రా రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని అప్పలనరసింహాపురానికి చెందిన బండారు వెంకటేశ్వర్లు(52) రోజు మాదిరిగానే శనివారం పశువులను మేతకు తీసుకెళ్లాడు. తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన ఆయన కాలు జారి బావిలో పడగా ఊపిరాడక మృతి చెందాడు. చాలాసేపటి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలిస్తుండగా బావిలో మృతదేహం కనిపించింది. ఘటనపై మృతుడు భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు...

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన ఆలస్యం పెద్దఅప్పారావు(77) వడదెబ్బకు గురై శనివారం మృతి చెందాడు. విపరీతమైన ఎండలు, వడగాలులుతో అస్వస్థతగకు గురైన ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యార్థికి అస్వస్థత

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జంపాల బాలరాజు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. జంగాలకాలనీకి చెందిన బాలరాజు ఈ నెల 16న పాఠశాలకు వచ్చి ఇంటికి వెళ్లేలోగా వాంతులు చేసుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులు లేకపోగా సోదరుడితో కలిసి నాయనమ్మ వద్ద ఉంటున్న ఆయనను శనివారం ఉపాధ్యాయులు పరామర్శించారు. అలాగే, మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వీరబాబు, ఆరెంపుల ఉపాధ్యాయుడు సతీశ్ కూడా వడదెబ్బ బారిన పడడంతో ఆస్పత్రిలో చేరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కామేపల్లి(కారేపల్లి): భర్త, అత్త, బావ వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని గరిడేపల్లికి చెందిన భట్టు నాగరాజుకు వరంగల్ జిల్లా చింతనెక్కొండకు చెందిన అనిత(25)తో మూడేళ్ల కిందట వివాహమైంది. వారికి 14 నెలల చిన్నారి ఉండగా, భర్త నాగరాజు, అత్త లక్ష్మి, బావ లక్ష్మణ్ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. దీంతో ఆమె ఈనెల 11న ఎలుకల మందు తాగగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రేమపేరుతో మోసం చేసిన కానిస్టేబుల్‌పై కేసు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఓ యువతి తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని ఇచ్చిన ఫిర్యాదుతో కానిస్టేబుల్‌పై శనివారం కేసు నమోదైంది. తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన బూరుగు కల్యాణ్‌కుమార్ హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండలానికి చెందిన యువతి సత్తుపల్లిలో నర్సుగా పనిచేస్తుండగా ఎనిమిదేళ్ల నుంచి ప్రేమించుకుని సహజీవనం చేశారు. తీరా పెళ్లికి కల్యాణ్ అంగీకరించకపోగా, యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై షాహీన తెలిపారు.




నాకంటే ఉన్నతంగా...

● అన్నీ తానై పిల్లలను తీర్చిదిద్దిన సుబ్బారావు



కుమారులు వెంకట భార్గవ్, సాయిచరణ్‌తో వెంకట సుబ్బారావు

ఖమ్మంగాంధీచౌక్: భార్య మరణించినా.. అన్నీ తానై పిల్లలను పెంచిపెద్ద చేసి ప్రయోజకులను చేశారు తండ్రి సుబ్బారావు.. ఖమ్మం త్రీటౌన్ గుట్టలబజార్ వాసవీనగర్ మహేశ్వరి టవర్స్‌లో నివాసముంటున్న విన్నమూరి వెంకట సుబ్బారావు మెకానికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న క్రమంలో భార్య వెంకటలక్ష్మి గుండె సంబంధిత అనారోగ్యంతో 2012 ఆగస్టులో మరణించారు. వెంకటలక్ష్మి కన్నుమూసే సమయానికిపెద్ద కుమారుడు వెంకట భార్గవ్ ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమారుడు సాయిచరణ్ పాఠశాల విద్యలో ఉన్నారు. సుబ్బారావు భార్య మరణాన్ని దిగమింగుకొని పిల్లల భవిష్యత్తే పరమావధిగా భావించి ముందుకు సాగారు. కాంట్రాక్ట్ పనులను కూడా తగ్గించుకుని నిత్యం పిల్లలను తీర్చిదిద్దారు. పిల్లలను పాఠశాల, కళాశాలలకు పంపించటం, వారి బాగోగులు చూసుకోవటం వంటి కార్యక్రమాలను దైనందికంగా పెట్టుకున్నారు. పెద్ద కొడుకు వెంకట భార్గవ్‌ను డిగ్రీ పూర్తి చేయించి, స్వశక్తిపై నిలబడేందుకు చేయూ తనివ్వటంతో స్వయం ఉపాధి పొందుతున్నాడు. ఆ కుమా రునికి వివాహం కూడా చేశారు. ఇక రెండో కుమారుడు సాయిచరణ్ బీటెక్ పూర్తి చేసి టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకులకు తల్లిలేని లోటు తీర్చి ప్రయోజకులను చేశారు. తమకు అన్నీ తానై చూసుకున్న తండ్రి సుబ్బారావును కూడా కుమారులు అంతే బాగా చూసుకుంటున్నారు. వాసవీ క్లబ్, లైన్స్ క్లబ్ సభ్యునిగా ఉంటూ సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటుండడం విశేషం.



- పిల్లలకు మనోధైర్యం.. భవిష్యత్‌కు పునాదులు..
- జీవితంలో స్థిరపడేవరకు అడుగడుగునా అండగా
- ఉన్నతస్థాయికి ఎదగడమే తండ్రి శ్రమకు అవార్డులు

బిడ్డలు తప్పటడుగు వేస్తే సరిదిద్దుతూ..
నడక నేర్చుకునేవరకు దారి చూపిస్తూ..
ప్రయోజకులయ్యేవరకు మార్గదర్శిగా నిలుస్తూ..
పిల్లలను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు
ఒత్తిడిని, కష్టాలను అధిగమిస్తూ..
ఆ బాధను పంటి బిగువనే భరిస్తూ..
చదువుల నుంచి ఉద్యోగం వరకు..
పాలన నుంచి పరిపాలన దక్షత వరకు..
పిల్లల ఎదుగుదలలో నాన్న ఎనలేని పాత్ర పోషిస్తాడు.
ఆ రెక్కల కష్టాన్ని గుర్తించిన పిల్లలు
ప్రభుత్వ కొలువులు, జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగి
తండ్రికి ప్రేమతో బహుమతి అందించారు.
ఆ క్షణాన చెమర్చిన కళ్లతో ఆనందపరవశులైన
తండ్రీ బిడ్డల కథనాలు..
నేడు ఫాదర్స్ డే సందర్భంగా..

● కుమారుడికి జన్మ.. పునర్జన్మ

కాలేయ దానం చేసిన ఉప్పలయ్య



ఉప్పలయ్య



శశికిరణ్

ముదిగొండ: బిడ్డకు జన్మనివ్వడమే కాదు... ప్రాణాన్ని ఫణంగా పెట్టి పునర్జన్మ కూడా ఇచ్చాడు దివ్యాంగుడైన ఓ తండ్రి. ఎనిమిది కేజీల బరువు తగ్గి మరీ కుమారుడికి కాలేయ దానం చేసిన ముదిగొండ మండలం యడవల్లికి చెందిన దొంతగాని ఉప్పలయ్య ఆదర్శంగా నిలిచారు. ఉప్పలయ్య – లలిత కుమారుడు శశికిరణ్‌కు అనారోగ్య సమస్య రావడంతో ఎక్కడ పరీక్షలు చేయించినా ఫలితం కానరాలేదు. కాలేయ మార్పిడి తప్ప మార్గం లేదని వైద్యులు చెప్పారు. కుమారుడిని ఆరోగ్యవంతుడిని చేయాలనే తపనతో కాలేయ దానం జీవన్‌దాన్ సంస్థను సంప్రదించినా ఫలితం దక్కలేదు. చివరకు తానే కాలేయ దానం చేయాలని ఉప్పలయ్య నిశ్చయించుకున్నాడు. ఈక్రమంలో పోలియో కారణంగా ఆయన నడవడమే కష్టం కాగా.. రోజూ కుట్టు మిషన్ ఆడితేనే ఇల్లు గడిచే పరిస్థితి లేదు. అయినప్పటికీ వైద్యుల సూచన మేరకు కాళ్లు సహకరించపోయినా రోజూ ఉదయం గంటపాటు సైక్లింగ్, కష్టమైనా కొంత దూరం నడిచేవాడు. ఇలా కఠోర ఆహార నియమాలతో కేవలం 45రోజుల్లో 8కేజీలు బరువు తగ్గాడు. ఆయన పట్టుదల చూసి వైద్యులే ఆశ్చర్యపోయారు. చివరికి 2018, జూన్4న హైదరాబాద్ నిమ్స్‌లో ప్రముఖ కాలేయ మార్పిడి నిపుణులు రాజేంద్రప్రసాద్, బీరప్ప బృందం 10 గంటల పాటు శ్రమించి ఉప్పలయ్య నుంచి 30శాతం కాలేయాన్ని తీసి దానిని కుమారుడు శశికిరణ్‌కు విజయవంతంగా అమర్చారు. శశికిరణ్ పదో తరగతి చదువుతున్నప్పుడు అవయవ మార్పిడి జరగగా, ఇప్పుడు ఆయన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడిని ఇంకా ఉన్నత స్థాయిలో చూడాలనే లక్ష్యంతో దివ్యాంగుడైన ఉప్పలయ్య నేటికీ శ్రమిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● కొడుకుల ద్వారా కల సాకారం

టి.వి. మెకానిక్‌గా తనయులను ఉన్నత స్థాయికి చేర్చిన చాంద్ పాషా



పెద్ద కొడుకు జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫ్‌తో తండ్రి చాంద్ పాషా



టీవీ రిపేర్ చేస్తున్న చాంద్ పాషా

ఖమ్మంమయూరిసెంటర్: తన స్నేహితులు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తూ.. అధికారి హోదాల్లో ఉన్నారు.. తాను మాత్రం టి.వి మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, తనలా తన కొడుకులు కష్టపడకుండా.. వారి భవిష్యత్ బంగారు బాటలో నడవాలని కలల కన్నాడు ఖమ్మానికి చెందిన టి.వి మెకానిక్ షేక్ చాంద్ పాషా. చాంద్‌పాషాకు కొడుకులు షేక్ ఆరీఫ్, షేక్ ఆసీఫ్, షేక్ అసలామ్‌లు ఉన్నారు. వీరికి చిన్ననాటి నుంచే సమాజ విలువలు, చదువు ప్రాధాన్యత, జీవిత విలువలను నేర్పుతూ పెంచాడు. సాంకేతిక పరమైన విద్యను చెప్పించేందుకు తన సంపాదన సరిపోదని తెలిసిన చాంద్ పాషా కొడుకులను డిగ్రీ చేయించాడు. ఆ డిగ్రీల ద్వారానే ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు అవసరమైన ప్రోత్సాహన్నిచ్చాడు. కుటుంబ భారాన్ని ఒక్కడే మోస్తూ.. ఆ కష్టాన్ని తన పిల్లలకు తెలియకుండా పెంచాడు. కొడుకులను ఉన్నత స్థానాల్లో చూడాలని కలలు కన్న చాంద్ పాషా కలలు సాకారం చేసుకున్నాడు. పాషా పెద్ద కుమారుడు ఆరీఫ్ డిగ్రీ అనంతరం షార్ట్‌హ్యాండ్, టైప్ నేర్చుకొని కోర్టులో ఉద్యోగం చేస్తూనే.. లా పూర్తి చేశాడు. కాజీపేట రైల్వే కోర్టులో జడ్జిగా చేరి మూడేళ్లపాటు విధులు నిర్వర్తించి ప్రస్తుతం నకిరేకల్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇక రెండో కుమారుడు ఆసిఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా, మూడో కొడుకు అసలామ్ ఖమ్మంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈసందర్భంగా చాంద్ పాషా మాట్లాడుతూ టి.వి.మెకానిక్‌గా జీవనం సాగిస్తూ తన కొడుకులను ఉన్నత స్థానాలకు చేర్చాలని తపన పడ్డానని తెలిపారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ చదివించే స్థోమత లేక డిగ్రీలు చదివించగా వారు వెనుకడుగు వేయలేదని చెప్పారు. పెద్ద కొడుకు జడ్జిగా విధుల్లో చేరిన రోజు తాము నేను పడిన కష్టానంతటిని మరిచిపోయానని తెలిపారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ జంగాల సునీల్‌కుమార్

● తండ్రి పేరుతో ఫౌండేషన్..

హెపటైటిస్ నివారణకు డాక్టర్ జంగాల కృషి



సునీల్‌కుమార్ తండ్రి రాజేశ్వరరావు (ఫైల్)

ఖమ్మం వైద్యవిభాగం: చిన్నతనం నుంచే మంచి విద్య అందడం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డాక్టర్ జంగాల సునీల్‌కుమార్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌గా స్థిరపడ్డారు. 2017లో తన తండ్రి జ్ఞాపకార్థం జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ ఫౌండేషన్ స్థాపించి హెపటైటీస్ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నారు. ఖమ్మం మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో, లివర్ ఆస్పత్రిలో ప్రతీ నెల మొదటి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వందకు పైగా శిబిరాలు నిర్వహించి వేల మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా శిబిరాల నిర్వహిస్తూ హెపటైటిస్ బీ, సీ రక్త పరీక్షలు, హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్, ఫైబ్రో స్కాన్ రోగులకు ఉచితంగా నిర్వహిస్తున్నారు. మందులు కూడా ఉచితంగానే ఇస్తున్నారు. దేశంలో 8 నుంచి 10 కోట్ల మంది ప్రజలు క్రానిక్ లివర్ డిసీస్‌తో బాధపడుతున్నారని, ఒకసారి వ్యాధి వచ్చాక తీవ్రత తగ్గించటం కష్టమని, దీన్ని పూర్తిగా నివారించాలనేదే తమ ట్రస్ట్ ఉద్దేశమని డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ఉచిత శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

● నలుగురు పిల్లలను ఉన్నతస్థాయికి చేర్చిన మెకానిక్..



చందర్, పద్మ దంపతులు, వారి పిల్లలు



షెడ్డులో బైక్ రిపేర్ చేస్తున్న చందర్

ఇల్లెందురూరల్: ఉన్న 20 గుంటల పొలంతో బతుకు నావ నడపలేక టేకులపల్లి మండలం నుంచి ఇల్లెందు చేరుకున్న వాంకుడోత్ చందర్, పద్మ దంపతులు మండలంలోని 21 పిట్ ఏరియాలో స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. జగదాంబసెంటర్‌లో ఓ చిన్నపాటి షెడ్డులో బైక్ మెకానిక్‌గా జీవితం ప్రారంభించిన చందర్ తన నలుగురు పిల్లలను కంటికి రెప్పలా పెంచి పోషించాడు. ఉన్నతంగా తీర్చిదిద్దాడు. బైక్ మెకానిక్‌గా తాను సంపాదించినదంతా పిల్లల చదువుకోసమే వెచ్చించాడు. తండ్రి కష్టాన్ని గుర్తించిన పిల్లలు కూడా చక్కగా చదువుకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పెద్ద కుమార్తె అనూష ఎంఏ బీఈడీ, రెండో కుమార్తె వినీష ఎంటెక్, మూడో కుమార్తె బిందు ఎంఎస్సీ కెమిస్ట్రీ, కుమారుడు అరవింద్ బీటెక్ పూర్తిచేశారు. పెద్ద కుమార్తె ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా, రెండో కుమార్తె ట్రాన్స్‌కో ఏఈగా, మూడో కుమార్తె బిందు అధ్యాపకురాలిగా ప్రభుత్వ కొలువులు సాధించారు. కుమారుడు అరవింద్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహం చేసి తండ్రిగా చందర్ తన పాత్రను పరిపూర్ణం చేసుకున్నాడు.

కుమారుడు లేడనే మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

ఫాదర్స్ డేకు ముందు రోజు ఘటన

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన గణగాని శ్రీనివాసరావు (40) నాగులవంచ రైల్వేస్టేషన్ సమీపాన రైలు కింద పడి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుమారుడు బోన్ కేన్సర్ వ్యాధితో నెల కిందట మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు. కాగా, రైలు ఢీకొట్టడంతో శ్రీనివాసరావు శరీరభాగాలు ముక్కలు కాగా అన్నం సేవా ఫౌండేషన్ బాధ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 12వ డివిజన్ రాఘవయ్య నగర్ రోడ్డు–6లో ఓ మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు చోరీ చేశారు. రఘునాథపాలెం మండలం రేగులచలకు చెందిన వంకాయలపాటి సీతమ్మ మధురానగర్‌లో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి శనివారం ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి నడుస్తూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతకుడు మొదట పరిశీలిస్తూ ముందుకెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి ఆమె మెడలో రూ.1.5 లక్షల విలువైన గొలుసు తెంచుకుని పారిపోయాడు. మహిళ కేకలు వేస్తుండగానే యువకుడు పారిపోవడంతో అక్కడి ఇళ్లలోని సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా ఖమ్మం అర్బన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

కూసుమంచి: మండలంలోని గంగబండ తండా వద్ద ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌పై శనివారం తెల్లవారుజామున ఆయిల్ ట్యాంకర్ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోయినా పెనుప్రమాదం తప్పింది. కాకినాడ నుంచి హైదరాబాద్ క్రూడా యిల్‌తో వెళ్తున్న ట్యాంకర్ గంగబండ తండా వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పైకి ఎక్కుతున్న సమయాన డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తా కొట్టింది. ఆ సమయాన వాహనాలు రాకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. అలాగే, ట్యాంకర్ ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొట్టిన సమయంలో గోడ ధ్వంసమైతే ట్యాంకర్ 50 అడుగుల ఎత్తు నుంచి కూసుమంచి – నేలకొండపల్లి రహదారిపై పడేదని చెబుతున్నారు. కాగా, ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడగా, ప్రమాద దృశ్యాలను సీసీ టీవీలో చూసిన వారు అతి వేగం, డ్రైవర్ నిద్రమత్తు కారణంనే జరిగిందని చెబుతున్నారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు క్రేన్ సాయంతో ట్యాంకర్‌ను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం వద్ద ఖమ్మం – బోనకల్లు రోడ్డుపై శనివారం ద్విచక్రవాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. భాస్కర్, వెంకన్న రోజు మాదిరిగానే ఖమ్మంలో కూలి పని చేసి స్వస్థలాలకు వెళ్తుండగా ధంసలాపురం వద్ద వారి ద్విచక్ర వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడినా కారులో ఉన్న వారు ఆపకుండా వెళ్లిపోయారు. క్షతగాత్రులను స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

- ఘటనలో యువకుడు మృతి
- న్యాయం కోసం కుటుంబీకుల ఆందోళన



చికెన్ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని కోళ్ల వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని విశ్వనాథపల్లికి చెందిన హలావత్ భాస్కర్ – అనురాధ దంపతుల కుమారుడు సాయికిరణ్ (23) డిప్లొమా పూర్తిచేశాడు. శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై పాతకమలాపురంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా గేటుకారేపల్లి నుంచి కారేపల్లి వస్తున్న కోళ్ల వ్యాన్ కారేపల్లి సంత సమీపాన ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌కు కారేపల్లిలో చికిత్స చేయించి ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి అనురాధ విశ్వనాథపల్లి వార్డు సభ్యురాలు. తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు. కాగా, చేతికందిన కొడుకును కోల్పోయిన తమకు న్యాయం చేయాలంటూ సాయి తల్లిదండ్రులు భాస్కర్ – అనురాధ, బంధువులు, గ్రామస్తులు ఆయన మృతదేహంతో కారేపల్లి మెయిన్‌రోడ్డులోని చికెన్‌షాపు ఎదుట ధర్నాకు దిగారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా ఎస్ఐ రామారావు చేరుకుని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. విశ్వనాథపల్లి సర్పంచ్ హలావత్ ఇందిరాజ్యోతితో పాటు బి.కుమార్, కె.నాగేశ్వరరావు, వి.మురళి తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదులు

'ఏపీ నాకు ఎంతో ప్రత్యేకమైంది'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తనపై చూపిన ప్రేమాభిమానాలు చూసి తాను చలించిపోయానని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా పనిచేసిన కాలం తన జీవితంలోనే మరిచిపోలేని సమయమని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు హైకోర్టు న్యాయవాదులు శనివారం గుంటూరు పరిధిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, పూర్వ ఏసీజే జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ఉప్పును పండించవచ్చు





కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద సముద్ర తీరంలో పెరిగిన సాలికోర్నియా మొక్కలు, వీటితో తయారుచేసిన సలాడ్స్

- సముద్ర తీరంలో మాత్రమే పెరిగే సాలికోర్నియా మొక్కలు
- వీటినుంచి ఉప్పును తీసుకోవచ్చు
- ఈ మొక్కలనే నేరుగా వంటకాల్లో వాడుకోవచ్చు
- వీటినుంచి ఇంధనం సైతం తీయొచ్చు
- ఉప్పునీటి చెరువుల్లో ఆక్వా సాగు చేసే రైతులకు కొత్త ఉపాధి

సాక్షి, అమరావతి: సాలికోర్నియా.. సముద్ర తీరం వెంబడి ఉప్పునీటి ప్రాంతాల్లో విస్తారంగా పెరిగే ఈ మొక్కలను సంప్రదాయ ఉప్పునకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని విమానాల్లో సైతం ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల్లో ఉప్పును తట్టుకుని పుష్పించే మొక్కల జాతికి చెందిన సాలికోర్నియా మొక్కల్లో 50 శాతం వరకు సోడియం క్లోరైడ్ నిండి ఉంటుంది. ఇందులోని లవణీయత సంప్రదాయ సముద్ర ఉప్పు రుచిని కలిగి ఉంటుంది. వీటి నుంచి తీసే ఉప్పును హెర్బల్ సాల్ట్, గ్రీన్ సాల్ట్‌గా పిలుస్తున్నారు.

ప్రొటీన్లు.. విటమిన్లూ ఉన్నాయ్

సాలికోర్నియా మొక్కల్లో 11 శాతం ప్రొటీన్లు, 20 శాతం ఫైబర్, జింక్, పొటాషియం, ఏ, బీ–1, బీ–12, బీ–15, సీ, ఈ విటమిన్లు అపారంగా ఉన్నాయని పరిశోధనల్లో గుర్తించారు. రక్తపోటు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఈ గ్రీన్ సాల్ట్ తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు చాలా దేశాల్లో ఈ మొక్క నుంచి ఉత్పత్తి చేసే ఉప్పును అన్ని వంటకాల్లో వాడుతున్నారు.

సీఎస్ఎంసీఆర్ఐ సాంకేతిక సహకారం

గుజరాత్ భావనగర్‌లోని సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) సాలికోర్నియా మొక్కల నుంచి ఉప్పు తయారు చేసే టెక్నాలజీని కనుగొంది. ప్రత్యామ్నాయ ఉప్పు తయారీకి సంబంధించిన అన్ని శాస్త్రీయ, సాంకేతిక సహాయాలను అందిస్తోంది. సాలికోర్నియా మొక్కల సాగు, కోత, మొక్కల్ని ఎండబెట్టడం, ఇతర ప్రక్రియల ద్వారా ఎకరాకు టన్ను ఉప్పు వస్తుందని సీఎస్ఎంసీఆర్ఐ చెబుతోంది. రూ.15 వేల పెట్టుబడితో రూ.25 వేలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని సౌదీ దేశాలలో కొన్ని విమానయాన సంస్థలు ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నాయట.

ఏపీలోనూ సాగుకు అవకాశాలు

ఏపీలో 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉంది. కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాల్లో పెద్దఎత్తున మడ అడవులు ఉన్నాయి. వాటిల్లో సాలికోర్నియా మొక్కలు విస్తారంగా ఉన్నట్టు గుర్తించారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా తీర ప్రాంతంలో ఈ మొక్కల జాడను సీఎస్ఎంసీఆర్ఐ గుర్తించింది. ఉప్పునీటి చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగుచేసే రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా సాలికోర్నియా మొక్కల సాగు నిలుస్తుందని చెబుతున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయ వనరుగా ఈ మొక్కల సాగు మారే అవకాశం ఉంది.

ఈ నెల 22న 'దశాబ్ది దగా'

119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నిరసన ర్యాలీలు

- బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై 10 తలలతో కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం: టీపీసీసీ నిర్ణయం



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఠాక్రే తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ రాష్ట్రం పదో ఏట అడుగుపెట్టిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ సొంత వ్యవహారం చేస్తోంది. ఈ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇందుకోసం ఈ నెల 22న 'దశాబ్ది దగా'పేరిట రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రత్యేక నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. అన్ని నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించాలి. రావణాసురుడి రూపంలో కేసీఆర్ దిష్టిబొమ్మలను తయారు చేసి, పది వైఫల్యాల తలలు పెట్టి ఆ దిష్టిబొమ్మలను దహనం చేయాలి. తర్వాత ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించాలి..'' అని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. శనివారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగింది. ఇందులో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంశాలపై చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణునాథ్, మన్సూర్‌అలీ ఖాన్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పీఏసీ సభ్యులు వీహెచ్, షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, రేణుకా చౌదరి, బలరాం నాయక్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తారో, ఏయే సీట్లు ఇస్తారో వెంటనే గుర్తించాలని పీఏసీ భేటీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ కోరినట్టు తెలిసింది. 2018లో చాలా సీట్లు చివరి నిమిషంలో ప్రకటించడంతో నష్టం జరిగిందని పేర్కొన్నట్టు సమాచారం. ఇక ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పనితీరు, ప్రభావం ఆధారంగానే టికెట్లు ఇవ్వాలని, పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అన్యాయం జరగకుండా చూడాలని వీహెచ్, రేణుకా చౌదరి సూచించినట్టు తెలిసింది.

పది రోజుల్లో మండల కమిటీలు

పీఏసీ భేటీ తర్వాత రేవంత్ మీడియాతో మాట్లాడారు. పార్టీ మండల కమిటీల ఏర్పాటుపై చాలా ప్రతిపాదనలు వచ్చాయని, వీటిపై చర్చించి 10 రోజుల్లోగా ప్రకటిస్తామని చెప్పారు. 'దశాబ్ది దగా'పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తుచేసేలా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. బీసీ డిక్లరేషన్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లలో ఏయే అంశాలను చేర్చాలన్న చర్చ జరుగుతోందని చెప్పారు. సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో జాతీయస్థాయి నేతలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటై ఇన్నేళ్లయినా 600 మంది అమరుల కుటుంబాలను గుర్తించలేకపోయారని, బాధ్యత లేని మంత్రుల వ్యవహార శైలితో అమరుల ఆత్మలు ఘోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని బీజేపీ, తెలంగాణలోని బీఆర్ఎస్‌కు దగ్గరి పోలిక ఉందని.. అక్కడ బీజేపీ 40 శాతం కమీషన్ సర్కార్ అయితే, ఇక్కడ బీఆర్ఎస్‌ది 30 శాతం కమీషన్ సర్కార్ అని రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్‌లో చేరేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారన్నారు.

అనుబంధ సంఘాల బాధ్యతలు కేటాయింపు

కాంగ్రెస్ అనుబంధ సంఘాల పర్యవేక్షణ బాధ్యతలను పలువురు టీపీసీసీ నేతలకు కేటాయిస్తూ రేవంత్ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ (సేవాదళ్, ఐఎన్‌టీయూసీ), గీతారెడ్డి (మహిళా కాంగ్రెస్), వినోద్‌రెడ్డి (యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ), మద్దుల గాల్‌రెడ్డి (ఎన్ఆర్ఐసెల్, ఓవర్సీస్)లకు బాధ్యతలను అప్పగించారు.

- టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, చావా రవి, మాణిక్‌రెడ్డి (యూటీఎఫ్), పోచయ్య (ఎస్‌టీఎఫ్), లింగారెడ్డి (డీటీఎఫ్), మురళి (టీటీఎఫ్), గోపాల్, రఘునందన్, వెంకటయ్య, రవిశంకర్‌రెడ్డి తదితరులు గాంధీభవన్‌లో రేవంత్‌ను కలసి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. సీపీఎస్ రద్దు, ఏటా పదోన్నతులు, బదిలీల అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు చెరో 45 సీట్లు

కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజల అభిప్రాయంలో భారీ మార్పు వచ్చిందని, కాంగ్రెస్ నిర్వహిస్తోన్న సర్వేల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సమాన అవకాశాలు కనిపిస్తున్నాయని రేవంత్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెరో 45 సీట్లలో గెలిచే అవకాశాలున్నాయని, 15 చోట్ల రెండు పార్టీల మధ్య గట్టి పోటీ ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు 37 శాతం ఓట్‌షేర్ వస్తే తమకు 35 శాతం వస్తోందని, బీజేపీ బలం 22 శాతం నుంచి 14 శాతానికి పడిపోయిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంఐఎం, బీజేపీ చెరో ఏడు చోట్ల గెలిచే అవకాశం ఉందన్నారు. పౌరహక్కుల నేత హరగోపాల్‌పై కేసును వెనక్కి తీసుకుంటామన్న ప్రకటనను తాను నమ్మడం లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. మోసం చేసేందుకే కేసీఆర్ కొన్ని ప్రకటనలు చేస్తుంటారన్నారు.

22న రాహుల్‌తో పొంగులేటి భేటీ?

- లేదంటే నెలాఖరులోపు సమావేశం.. జూలై మొదటి వారంలో ఖమ్మంలో సభ
- ఠాక్రేతో సమావేశమైన నాగం, కూచుకుళ్ల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరతారని భావిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 22న లేదంటే నెలాఖరులోగా ఏదో ఒక రోజు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ నెల 21న రాహుల్ విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీ రానున్న నేపథ్యంలో ఆయనతో భేటీ తర్వాతనే పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరే విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్‌తో భేటీ అనంతరం ఖమ్మంలో జూలై మొదటి వారంలో భారీ బహిరంగ సభ నిర్వహించి పొంగులేటి, మహబూబ్‌నగర్‌లో సభ నిర్వహించి మాజీ మంత్రి జూపల్లి, వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరతారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సభ కూడా ఖమ్మం వేదికగా జరగనుంది. ఖమ్మంలో జరగనున్న ఈ రెండు సభలకు రాహుల్, ప్రియాంకాగాంధీలను ఆహ్వానించాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తన పాదయాత్ర ముగింపు సభలో పాల్గొనాలని కోరుతూ రాహుల్, ప్రియాంకా గాంధీతో పాటు పార్టీ అధిష్టానానికి లేఖ రాశారు.

రాహుల్‌తో పొంగులేటి జూమ్ మీటింగ్?

ఇటీవల రాహుల్‌గాంధీతో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జూమ్ ద్వారా మాట్లాడారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. రాహుల్‌గాంధీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాతే పొంగులేటి, జూపల్లిల చేరిక తేదీలు ఖరారు కానున్నాయి.

ఠాక్రేతో నాగర్‌కర్నూల్ నేతల భేటీ

శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పార్టీలో చేరిక, టికెట్ కేటాయింపు తదితర అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. భేటీ అనంతరం దామోదర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆయన కూడా మహబూబ్‌నగర్‌లో జరిగే సభలోనే చేరనున్నట్టు తెలుస్తోంది.

బీఆర్ఎస్, బీజేపీ.. రెండూ ఒకటే

- రాష్ట్రంలో ఇతర పార్టీల ఉనికి లేకుండా చేయడమే వాటి లక్ష్యం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని శిబిరం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పరస్పర విమర్శలు బీజేపీ, బీఆర్ఎస్‌లు కలసి ఆడుతున్న నాటకంలో భాగమేనని ధ్వజమెత్తారు. ఈ పార్టీలు రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలకు ఉనికి లేకుండా చేయాలని కుట్ర పన్నాయన్నారు. ఆ పార్టీల కుట్రలను ఇప్పటికే కాంగ్రెస్ బయటపెట్టిందన్నారు. బడ్జెట్ సమావేశాలు, జాతీయ జెండా ఆవిష్కరణ వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎప్పుడూ గవర్నర్‌తో కలిసి పాల్గొనేందుకు ఇష్టపడని కేసీఆర్ ఇప్పుడు సయోధ్య కుదుర్చుకొని, చిరునవ్వులు నవ్వుతూ గవర్నర్‌తో కలసి పోవడంతో.. కేసీఆర్ గురించి తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందన్నారు. నియంతృత్వ పోకడలతో ఫాసిస్టు పాలన సాగిస్తున్న మోదీ, కేసీఆర్‌లను వదిలించుకుంటే తప్ప తమకు స్వేచ్ఛ ఉండదని ప్రజలు గ్రహించారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అంతా అవినీతేనని అన్నారు. ధరణితో భూ కుంభకోణాలు, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లీజు అక్రమాలు, విలువైన భూముల అమ్మకాల్లో అవినీతి, కాళేశ్వరం అవినీతి, లిక్కర్‌స్కాం చిట్టా తమ వద్ద ఉందని మాట్లాడిన అమిత్‌షా, మోదీలు ఇప్పటివరకు కేసీఆర్‌పై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోకి వెళ్లిన నాయకులు కేసీఆర్ అసలు స్వరూపం తెలుసుకుని పెద్దఎత్తున మళ్లీ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మొదలు పెట్టి 3 నెలలు దాటుతోందని, రాష్ట్ర ప్రజలకు సంబంధించిన గుండె చప్పుడు, వారి ఆవేదనను మీడియా సాక్షిగా తెలంగాణ సమాజానికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నానన్నారు. మీడియా సమావేశంలో నల్లగొండ పట్టణ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, నల్లగొండ ఎంపీపీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు


కొత్తగూడెం ఏరియాలో డైరెక్టర్ పరిశీలన



కోల్‌బెంచ్‌లో సూచనలు చేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీని డైరెక్టర్ (పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్వారీలో ఉన్న కోల్ బెంచ్, ఓసీ బెంచ్‌లను పరిశీలించి మాట్లాడారు. గనిలో రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి సారించాలని, లక్ష్యాల మేరకు ఉత్పత్తి, రవాణాపై శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఏరియా జీఎం జక్కం రమేశ్, జీకేఓసీ పీఓ శ్రీరమేశ్, మేనేజర్ ఎస్ఎస్ఆర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకం విధిస్తే రైతులకు లాభం



కేంద్ర మంత్రి తోమర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణారెడ్డి

దమ్మపేట: పామాయిల్ ముడి చమురుపై దిగుమతి సుంకం విధించాలని, తద్వారా వ్యాపారులు వెనక్కి తగ్గితే స్థానికంగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు లాభం ఉంటుందని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్‌తో కలిసి శనివారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పామాయిల్ గెలల టన్ను ధర రూ.20 వేల నుంచి రూ.13 వేలకు పడిపోవడంతో రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యాన పామాయిల్ ముడిచమురు దిగుమతులపై సుంకం విధించి, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కూడా కలిసి పామాయిల్ గెలల ధర పెరిగేలా కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాలని వినతిపత్రం అందజేశారు.

దశాబ్దిలో అతివేగంగా గిరిజనాభివృద్ధి

- ఎంపీలు నామా, పార్థసారధిరెడ్డి
- ఐటీడీఏలో ఘనంగా తెలంగాణ గిరిజన ఉత్సవాలు
- హాజరైన కలెక్టర్, పీఓ, ఎమ్మెల్యేలు



డోలి కళాకారుడు రామచంద్రయ్యను సత్కరిస్తున్న ఎంపీలు నామా, పార్థసారథిరెడ్డి, విప్ కాంతారావు, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు వనమా, నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్, పీఓ గౌతమ్ తదితరులు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో గిరిజన అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవాన్ని భద్రాచలంలోని ఐటీడీఏ ఆవరణలో ఉన్న గిరిజన భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు ఎంపీలు పాల్గొనగా కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతించారు. అనంతరం ఎంపీ నామా మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. స్వపరిపాలన కోసం తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న ఆదివాసీ, గిరిజనుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నామని తెలిపారు. గిరిజనులు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ పథకాలను గిరిజనుల దరికి చేర్చేలా అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ గిరిజన గ్రామాల్లోని ఆదివాసీ బిడ్డలపై ఉన్న గౌరవంతో అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా శుద్ధిచేసిన తాగునీరు సరఫరా చేస్తుండడంతో వ్యాధులు దరి చేరడం లేదని చెప్పారు. కొత్తగూడెం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుచేశామని తెలిపారు. అలాగే, కల్యాణలక్ష్మితో బాల్యవివాహాలు తగ్గాయని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన ప్రగతిని మననం చేసుకోవడానికి ఈ ఉత్సవాలు దోహదపడుతాయని తెలిపారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ప్రగతిని ప్రజలకు వివరించాలి

గిరిజన, ఏజెన్సీ గ్రామాల్లో జరిగిన ప్రగతిని ఉత్సవాల సందర్భంగా ప్రజలకు వివరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ సూచించారు. పాలనా సంస్కరణ దృష్ట్యా జిల్లాల విభజనతో ప్రజలకు అధికారులు దగ్గరయ్యాయని తెలిపారు. ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత గిరిజనుల జీవితాలలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. పెరిగిన గిరిజన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు తదితర నిర్ణయాలతో మేలు జరుగుతోందని చెప్పారు. తొలుత గిరిజన డోలి కళాకారుడైన చకినం రామచంద్రయ్యకు పద్మశ్రీ దక్కిన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు

- ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత
- 21 జీపీ భవనాలకు శంకుస్థాపన చేసిన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



టేకులపల్లి సెంటర్‌లో జీపీ భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే

టేకులపల్లి: స్వరాష్ట్రంలోనే గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం టేకులపల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన గిరిజన దినోత్సవంలో ఆమె మాట్లాడారు. తొలుత మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు మంజూరైన కార్యాలయ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 21 జీపీ భవనాలకు రూ.4.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూడగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం అన్నివిధాలా భరోసా కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. స్వయం పాలనే ధ్యేయంగా సీఎం కేసీఆర్ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పాటు ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో రిజర్వేషన్లను పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. అలాగే, గిరిజనులకు పోడు పట్టాలు, తండాలకు విద్యుత్, రహదారుల సౌకర్యం కల్పించారని తెలిపారు. తొలుత మహిళలతో కలిసి ఎమ్మెల్యే కోలాటం ఆడారు. కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ ఈఈ తానాజీ, ఏఈ సలార్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలుతో పాటు బానోత్ హరిసింగ్‌నాయక్, తేజావత్ రవి, బానోతు రమ, బానోత్ కిషన్, చీమల సత్యనారాయణ లక్కినేని శ్యామ్, ఎట్టి ప్రసాద్, జాటోతు నరేశ్, బర్మావత్ శివకృష్ణ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ప్రతిఘటిద్దాం

- కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడితే బలపరుద్దాం
- రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో టీఏజీఎస్ నేత రవికుమార్



మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

భద్రాచలంఅర్బన్: కార్మిక హక్కుల సాధనలో పాలకులు అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ అనుకూల రాజకీయ, ఆర్థిక విధానాలను ప్రతిఘటించడమే కీలకమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ తెలిపారు. ఇదే సమయాన కార్మికులు రాజకీయాలను పరిశీలన చేసి అర్థం చేసుకుంటూ కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడే వారిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు భద్రాచలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వర్తమాన రాజకీయ పరిస్థితులు – కార్మికులపై ప్రభావం'అంశంపై రవికుమార్ మాట్లాడుతూ దేశ రాజకీయ పరిస్థితులు కార్పొరేట్ల గుప్పిట్లో ఉన్నాయని తెలిపారు. అయితే, ఉత్పత్తి రంగంలో కూడా విద్యుత్ సహా బ్యాంకింగ్, పారిశ్రామిక రంగాలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. కార్మికులు ఆర్థిక అంశాలపైనే కాక రాజకీయ విధానాలపై కూడా పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని నిలదీస్తాం

విద్యుత్ రంగ కార్మికులకు వేతన ఒప్పంద సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని పోరాటాల ద్వారా నిలదీస్తామని యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు వెల్లడించారు. ప్రభుత్వం చేసిన వేతన ఒప్పందంతో జూనియర్ లైన్‌మెన్లు, అన్‌మ్యాన్ కార్మికులు, పీస్‌రేట్ కార్మికులకు తీరని నష్టం జరిగిందన్నారు. తొలుత యూనియన్ పతాకాన్ని యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొల్లి వెంకటరాజు ఆవిష్కరించారు. సమావేశంలో సీఐటీయూ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, యూనియన్ నాయకులు ఎం.స్వామి, కొలగాని రమేశ్, ప్రసాద్, రాజు, చంద్రారెడ్డి, అంకిరెడ్డి నరసింహారావు, బసవరాజు, ప్రసాద్, పదిలం శ్రీనివాస్, కె.శ్రీనివాస్, పులి గణేశ్, జి.వెంకన్న, సురేశ్, సత్యం, వర్మ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్ విషయంలో దళారులను నమ్మొద్దు

- పారదర్శకత కోసం ఏసీబీకి అప్పగించాం
- జీఎంలతో సమీక్షలో సింగరేణి డైరెక్టర్ బలరామ్



జీఎంలతో సమీక్షిస్తున్న సింగరేణి డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల విషయంలో నిర్వహించే మెడికల్ ఇన్‌వాలిడేషన్(మెడికల్ బోర్డ్)లో పారదర్శకత కోసం ఏసీబీకి అప్పగించామని, త్వరలోనే వారి పరిశీలన మొదలవుతుందని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ తెలిపారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఆయన వివిధ విభాగాల జీఎంలతో సమావేశమయ్యారు. మెడికల్ బోర్డ్ జాబితా, ఇతర విషయాలు బయటకు వెళ్లినట్లు తేలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని సీనియారిటీ ప్రకారంగానే మెడికల్ బోర్డ్‌కు పిలవాలని, ఎట్టి పరిస్థితుల్లో క్రమం తప్పరాదని తెలిపారు. మెడికల్ బోర్డ్‌కు హాజరయ్యే వారి వ్యాధుల ఆధారంగా 70శాతం మందిని ఇన్‌వాలిడేషన్ చేస్తున్నామని, ఇందులో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో వ్యాధి తీవ్రతను గుర్తిస్తే అన్‌ఫిట్ చేస్తారే తప్ప ఇతర అంశాలకు తావుండదని చెప్పారు. కాగా, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే సింగరేణి విజిలెన్స్ విభాగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిఘా పటిష్టం చేస్తాం

మెడికల్ బోర్డ్ జరిగే రోజున గనులు, సింగరేణి ఆస్పత్రులతో పాటు మిగతా చోట్ల నిఘా పటిష్టం చేస్తామని డైరెక్టర్ బలరామ్ వెల్లడించారు. అలాగే, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తప్పా ఇతర నేతలు కనిపిస్తే సీసీ పుటేజీ ద్వారా విచారణ జరిపేలా సింగరేణి విజిలెన్స్, ఇంటెలిజెన్స్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ విషయంలో త్వరలోనే పోలీసు ఉన్నతాధికారులతో కూడా చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి, జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, జీఎం విజిలెన్స్ ప్రసాద్‌రావు, సీఎంఓ బి.వెంకటేశ్వరరావు, సీనియర్ పీఓ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఉద్యోగి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.